క్లుప్తంగా

గోవింద భక్తులకు అంబలి పంపిణీ



అంబలి, మజ్జిగ అందుకుంటున్న భక్తులు

నగరి: తమిళనాడు నుంచి తిరుమలకు నగరి పట్టణం మీదుగా పాదయాత్ర చేసే గోవింద భక్తులకు స్థానిక ఓంశక్తి ఆలయం వద్ద అంబలి, మజ్జిగ పంపిణీ చేశారు. ఎండపట్టున వచ్చే వారికి సేదతీర్చడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. పాదయాత్ర చేస్తూ వచ్చిన గోవింద భక్తులు అంబలి, మజ్జిగ సేవించి ఆలయ పరిసరాల్లో సేదదీరారు.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి



పాడి పశువులకు టీకాలు వేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ గోపాలక్రిష్ణ

పాలసముద్రం: పాడి పశువుల పెంపకంలో రైతులు సరైన జాగ్రత్తలు పాటించాలని పశువైద్యాధికారి యశస్వి తెలిపారు. శనివారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ పరిధిలో వెటర్నరీ అసిస్టెంట్ గోపాలక్రిష్ణ సమక్షంలో ఉచిత పశు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాడి రైతులకు పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. పశువులకు వ్యాధులు వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే గ్రామాల్లో ఉంటే వెటర్నరీ అసిస్టెంట్లకు తెలియజేయాలన్నారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలను విధిగా చేయించాలన్నారు. అనంతరం పాడి పశువులకు ఉచితంగా టీకాలు, పిడుదుల మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో గోపాలమిత్ర నాగరాజు, పాడి రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రదోష పూజలు



నందీశ్వరునికి అభిషేకం

నగరి: పట్టణ పరిధిలోని కరకంతేశ్వర ఆలయంలో శనివారం శనిప్రదోష పూజలు ఘనంగా నిర్వహించారు. కరకంతేశ్వర స్వామివారి విగ్రహానికి ఎదురుగా ఉన్న నందీశ్వరునికి, శనీశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు చేసి అలంకరించారు. భక్తులు విగ్రహాల వద్ద దీపాలు వెలిగించి ప్రదోష పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు దుర్గాప్రసాద్ భక్తుల పేరిట దోషనివారణ పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని శ్రీ జైన్‌సంఘ ప్రార్థన మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సుభాష్ జైన్ తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు ఈశిబిరం ఉంటుందన్నారు. అరవింద్ ఐ ఆస్పత్రి వైద్యులచే పరీక్షలు చేసి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

గోకులాల గోస



వెంగళరాజుకుప్పంలో లబ్ధిదారులు నిర్మించుకున్న గోకులం షెడ్

ఆరు పశువుల గోకులం షెడ్ యూనిట్ కాస్ట్ రూ.2.30 లక్షలు కాగా.. ఇందులో 90 శాతం ఉపాధి నిధుల కింద చెల్లిస్తారు. 10 శాతం లబ్ధిదారుల వాటా. ఏదో రకంగా గోకులం షెడ్ నిర్మాణం మమ అనిపిస్తే బిల్లు వచ్చేస్తుందనుకున్నారు. కనీసం రూ.లక్ష వరకు ఆదాయం ఉండకపోతుందా అని అప్పులు తెచ్చి గోకులం షెడ్ల నిర్మాణం చేపట్టారు. తీరా చూస్తే బిల్లుల ఊసే లేకపోవడంతో గోకులం షెడ్లను దక్కించుకున్న టీడీపీ నాయకులకు అప్పులే మిగిలాయి.

–పాలసముద్రం

- బిల్లులు ఇవ్వండి బాబూ...
- అప్పులు తీసుకొచ్చి గోకులం షెడ్ల నిర్మాణాలు
- నిర్మాణాలు పూర్తయినా అందని బిల్లులు
- లబోదిబో మంటున్న గోకులం లబ్ధిదారులు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పశువుల గోకులం షెడ్లు టీడీపీ కార్యకర్తలే దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో నగదు చేతిలో లేకపోయినప్పటికీ అప్పులు తెచ్చి షెడ్లు నిర్మించేశారు. బిల్లులు వస్తే వెంటనే అప్పులు చెల్లించవచ్చనే ఉద్దేశంతో నిర్మాణాలను ముగించారు. ప్రస్తుతం షెడ్లు నిర్మించుకొని నెలలు గడుస్తున్నా బిల్లులు ఊసే లేకపోవడంతో వారి సంతోషం ఆవిరైపోయింది. బిల్లులు ఎప్పుడు ఇస్తారంటూ లబ్ధిదారులు ఉపాధి హామీ కార్యాలయాల



గంగాధరనెల్లూరులో గోకులం షెడ్‌ని పరిశీలిస్తున్న జేడీ ప్రభాకర్

ఏపీఓలు, ఈసీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 2024 జూన్ నెలలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన కూటమి ప్రభుత్వం మండల, గ్రామస్థాయి నేతలకు ఉపాధి హామీ నిధులలో సీసీ రోడ్లు, డ్రైన్స్ నిర్మాణాల ద్వారా సంపాదించుకునే

మండలం పేరు	మంజూరైన షెడ్లు	నిర్మించినవి
గంగాధరనెల్లూరు	50	35
కార్వేటినగరం	51	33
పెనుమూరు	43	13
శ్రీరంగరాజుపురం	65	39
వెదురుకుప్పం	33	30
పాలసముద్రం	39	27

అవకాశం కల్పించింది. కూటమి పార్టీల కార్యకర్తలు పాడి పశువుల షెడ్లు కోసం పోటీపడ్డారు. సంబంధిత టీడీపీ ఎమ్మెల్యే సిఫారసులతో జిల్లా యంత్రాంగం వీటిని మంజూరు చేసింది. పాడి పశువులతోపాటు గొర్రెలు, మేకలు, కోళ్లకు కూడా ఉపాధి నిధులతో షెడ్లు నిర్మించుకునే అవకాశం కల్పించారు. అయితే ఆరు పాడిపశువుల షెడ్లకు యూనిట్ కాస్ట్, సబ్సిడీ ఎక్కువగా ఉండడంతో వీటిపైనే దృష్టి సారించారు. మంజూరు కావాలంటే పశువులు ఉండాలి. కానీ టీడీపీ నేతల సిఫారసుల కారణంగా పశవులు లేని వారికి కూడా షెడ్లు మంజూరు చేశారు.

ఖాతాలు పరిశీలించుకోండి

పనులు పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత క్రమంలో బిల్లులు చెల్లించనున్నట్లు ప్రకటించడంతో లబ్ధిదారులు సకాలంలో గోకులం షెడ్ల పనులు పూర్తి చేశారు. అయితే నేటికి బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాలేదు. ఎప్పుడు విడుదలవుతాయోనని రైతులు ఎదురు చూస్తున్నారు. నిర్మాణాలు పూర్తయిన వారి వివరాలు నమోదు చేసి పంపామని, వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేస్తుందని ఉపాధిహామీ సిబ్బంది చెబుతున్నారు. బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా బిల్లులు జమ కాలేదు.

రూ.2.30 లక్షలు ఖర్చు అయింది



గోకులం షెడ్ మంజూరు కావడంతో ఉపాధి హామీ సిబ్బంది తొందర పెట్టారు. త్వరలో నిర్మించుకోకపోతే షెడ్ రద్దువుతుందని చెప్పడంతో రూ.2.30 లక్షలు ఖర్చు చేసి షెడ్ నిర్మించుకున్నాను. రూ.1400 బిల్లు వచ్చింది. అప్పటి నుంచి ఇంతవరకు బిల్లు పడలేదు. ఉపాధి హామీ సిబ్బందిని అడిగితే బిల్లులు పెట్టాం.. బ్యాంకు ఖాతాల్లో జమ అవుతందని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి బిల్లులు విడుదల చేయాలి. లేకుంటే అప్పుల పాలైపోతాం.

–సత్య, వెంగళరాజుకుప్పం, గోకులం షెడ్ లబ్ధిదారుడు

అప్పులే చేసి షెడ్ నిర్మించాం



వర్షాలు, ఎండలకు పాడి పశువులను కట్టడానికి ఇబ్బందిగా ఉందని గోకులం షెడ్ మంజూరు చేసుకున్నాను. అప్పులు చేసి గోకులం షెడ్ పనులు పూర్తి చేసుకున్నాను. అయితే బిల్లు మాత్రం ఒక్క రూపాయి కూడా మా ఖాతాల్లో పడలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బిల్లులు వచ్చేలా చూడాలి.

–రమేష్, పాలసముద్రం షెడ్ లబ్ధిదారుడు

బిల్లులు అప్‌లోడ్ చేశాం



మండలంలో ఉపాధి హామీ నిధులతో గోకులం షెడ్లు, సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలు చేపట్టాం. వాటికి సంబంధించిన బిల్లులను చెల్లించాలని ప్రభుత్వానికి గత రెండు నెలల క్రితమే విన్నవించాం. అందుకు సంబంధించిన బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాం. త్వరలో బిల్లులు విడుదలవుతాయి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నిర్మాణాలు పూర్తి చేయని వారు త్వరగా పూర్తి చేయాలి.

–మార్గరెట్, పాలసముద్రం, ఏపీఓ

కుష్టు వ్యాధిగ్రస్తులు ఆందోళన చెందొద్దు



తిరుమలరాజుపురంలో స్పర్శలేని మచ్చలు పరిశీలిస్తున్న డాక్టర్ మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం: కుష్టు వ్యాధి బాధితుల ఆందోళన పడవద్దని పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. శనివారం గంగమాంబపురం, తిరుమలరాజుపురం, మిద్దినత్తం గ్రామాల్లో తమ సిబ్బందితో కలసి పర్యటించారు. చర్మంపై ఉన్న స్పర్శ లేని మచ్చలను పరిశీలించారు. డాక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో కుష్టు వ్యాధిగ్రస్తులను సమాజంలో చిన్న చూపు చూడకుండా ఆదరించాల్సిందిగా పేర్కొన్నారు. బహుళ ఔషధాలను వినియోగించి వ్యాధిని పూర్తిగా నయం చేసే అవకాశం ఉందన్నారు. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో వ్యాధి నివారణ మందులు లభిస్తాయని తెలిపారు. స్పర్శలేని మచ్చలు ఉన్న వారు వెంటనే ప్రభుత్వ అస్పత్రిలో డాక్టర్ వద్దకు వెళ్లి పరీక్ష చేసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ మురళి, సుశీల పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

బంగారుపాళెం: పాలమాకులపల్లె పిళ్లారిగుండు వద్ద బెంగళూరు–చెన్నై జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంతో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. బోడబండ్ల గ్రామానికి చెందిన వెంకటేష్ ద్విచక్ర వాహనంపై పలమనేరు నుంచి బంగారుపాళ్యానికి బయల్దేరాడు. పిళ్లారిగుండు వద్ద జాతీయ రహదారి పక్కన అండర్ గ్రౌండ్ కేబుల్ వైర్లు వేసేందుకు గొయ్యి తీసి మట్టిని కుప్పగా వేశారు. ప్రమాదవశాత్తు మట్టికుప్పను ఢీకొని రహదారిపై పడ్డాడు. దీంతో తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని స్థానికులు, ప్రయాణికులు బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించండి

వెదురుకుప్పం: రోడ్డుకిరువైపులా ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని ఎంపీడీఓ పురుషోత్తం ఆదేశించారు. మండలంలోని పచ్చికాపల్లంలో దుకాణాల వద్ద రోడ్డు స్థలం ఆక్రమణకు గురి కావడంతో శనివారం అధికారులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు ఉండడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతున్నట్లు పేర్కొన్నారు. అందరూ సహకరించి సమస్యను పరిష్కరించేందుకు ముందుకు రావాలని సూచించారు. పచ్చికాపల్లం దాసరి కాలనీలో రాములవారి గుడి పక్కన డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. త్వరలో పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మోహన్‌కుమార్, సర్వేయర్ భానుమతి, పంచాయతీ కార్యదర్శి సాయిభవాని, వీఆర్‌ఓ భీమయ్య, గ్రామ సర్వేయర్ దేవిక, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సింధూజ, రెవెన్యూ, ఆర్అండ్‌బీ సిబ్బంది పాల్గొన్నారు.



దాసరి కాలనీలో మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న అధికారులు

పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యాధికారి శ్రీవిద్య

శ్రీరంగరాజపురం: పాడి పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల పశువైద్యాధికారి శ్రీవిద్య అన్నారు. మండలంలోని రాఘవరాజపురం గ్రామంలో కాసా ప్రాజెక్టు ఆధ్వర్యంలో పత్యేక పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి శ్రీవిద్య మాట్లాడుతూ పశువులు, మేకలు, గొర్రెలకు నట్టలనివారణ మందులు, గర్భకోశ వ్యాధి మందులను ఏ విధంగా వాడాలో అవగాహన కల్పించారు. పాడి రైతులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాసా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కరుణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కృపాలక్ష్మికి ఘన స్వాగతం



రేణిగుంటలో కృపాలక్ష్మికి స్వాగతం పలుకుతున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు

కార్వేటినగరం: వైఎస్ఆర్ సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గం సమన్వయ కర్త, రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మికి రేణిగుంట విమానాశ్రయంలో స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. దాదాపు రెండు నెలలు తర్వాత విజయవాడ నుంచి నియోజకవర్గానికి చేరుకునేందుకు రేణిగుంట విమానాశ్రయంలో దిగిన కృపాలక్ష్మికి ఘనంగా స్వాగతం పలికారు. రేణిగుంట నుంచి పుత్తూరు వరకు యువనాయకుడు శ్యామ్ ఆధ్వర్యంలో కార్లు, ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం ఇన్‌చార్జి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలలో జోష్ కనిపిస్తోందన్నారు. ప్రతి నిత్యం అందుబాటులో ఉంటూ కూటమి నాయకులు చేపడుతున్న అక్రమాలు, భూ దందాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ర్యాలీలో జై జగన్, కృపాలక్ష్మి నాయకత్వం వర్ధిల్లాలనే నినాదాలు మారుమోగాయి. ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు, వైఎస్ఆర్ సీపీ అభిమానులు పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయండి

నింద్ర: మండలంలోని అత్తూరు గ్రామంలో పొలాలకు వెళ్లే రోడ్డు గుంతలుగా మారడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పూర్తిగా గుంతలుగా మారడంతో ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు ఆ దారిలో వెళ్లలేక పోతున్నాయి. వర్షం పడితే చాలు గుంతల్లో నీరు చేరి, ఆ గుంతలు కనిపించడం లేదు. దీంతో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. మొత్తం గ్రామంలో 120 మంది రైతులు ఉన్నారు. గతంలో రోడ్డు లేకుంటే రైతులు కలసి వారి వారి పంట పొలాలకు రోడ్డు కోసం కొంత స్థలాన్ని వదిలి వేశారు. దీంతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. అప్పటి నుండి రైతులు మరమ్మతులు చేసుకునేవారు. పొలాల పక్కనే ఎస్టీకాలనీ ఉంది. ఎస్టీకాలనీ వాసులకు కూడా ఈ రోడ్డు ఉపయోగపడుతోంది. దీంతో పలు సార్లు పంచాయతీ నిధులు ఖర్చు చేసి రోడ్డు మరమ్మతులు చేసుకునేవారు. గత పది సంవత్సరాలుగా పంచాయతీకి నిధులు లేక పోవడంతో ఈ రోడ్డు మరమ్మతులు నోచుకోలేదు. దీంతో రైతులకు సమస్యగా మారింది. పండిన పంటలు, చెరకు వంటివి తరలించాలంటే రైతులు ఈ రోడ్డు ద్వారానే రావాలి. కానీ రోడ్డు గుంతలుగా ఉన్నందున చెరకు పంట వేయడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు సక్రమంగా లేకపోతే ఆ దారిలో చెరకు తరలించడానికి ఇబ్బందికరంగా ఉంటుంది. ఈ సమస్యపై ఎస్టీకాలనీవాసులు, రైతులు పలుసార్లు సంబంధిత అధికారులకు పలుసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదు. రోడ్డు బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.



బురదమయంగా మారిన రోడ్డు

శాస్త్రోక్తంగా ప్రదోషకాల పూజలు



కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీమణికంఠేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రదోష కాల పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఉదయం మూలవిరాట్, నందీశ్వరుడికి ప్రత్యేక అభిషేకం, విశేష పూజలు చేశారు. భక్తులకు దర్శనం కల్పించి అర్చన చేశారు. భక్తులు స్వామి దర్శనార్థం క్యూకట్టారు. కర్పూర హారతులతో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పూజలో ఈవో పెంచలకిషోర్, సిబ్బంది కోదండపాణి, వాసు, అర్చకులు పాల్గొన్నారు.

పుత్తూరులో ఆపస్ హెల్ప్‌డెస్క్

పుత్తూరు: ఉపాధ్యాయుల బదిలీలపై ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) వారు పుత్తూరులో హెల్ప్ డెస్క్‌ను శనివారం ప్రారంభించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఏర్పాటైన హెల్ప్ డెస్క్ కార్యాలయంలో ఆపస్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎం.సుబ్రమణ్యం మాట్లాడుతూ జరగబోవు బదిలీలకు సంబంధించి ఉపాధ్యాయులంతా తమ సందేహాలను హెల్ప్ డెస్క్ ద్వారా నివృత్తి చేసుకోవచ్చునన్నారు. అలాగే ఆన్‌లైన్‌లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు బదిలీల తుది దశ వరకు హెల్ప్‌డెస్క్ పని చేస్తుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర, జిల్లా ఉపాధ్యక్షులు దొరస్వామి, శివకుమార్, నాయకులు చక్రపాణి, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.



హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్న ఆపస్ నేతలు

పశు వైద్యశాలకు నీటి కష్టాలు

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం పశువైద్యశాలలో నీటి కష్టాలు తీవ్రంగా ఉండడంతో పశువులకు వైద్యం అందించడానికి కూడా వైద్యాధికారులు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. బొమ్మసముద్రం ప్రాంతంలో సుమారు 50 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లోని రైతులకు సంబంధించిన పాడిపశువులు, మేకలు, గొర్రెలకు చికిత్సలు అందించడానికి వీలుగా బొమ్మసముద్రం హైస్కూల్ రోడ్డు సమీపంలో పశువైద్యశాలను ఏర్పాటు చేశారు. అయితే ఈ పశువైద్యశాల పక్కనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అయితే బొమ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి పశువైద్యశాలకు తాగునీరు వచ్చేది. కొద్ది నెలల క్రితం రాజకీయ నాయకుల జోక్యంతో ఆస్పత్రి వారు పశువైద్యశాలకు వస్తున్న నీటి సరఫరాను నిలిపివేశారు. ఎదకు వచ్చిన పశువులకు టీకాలు వేయాలన్నా నీరు తప్పనిసరి కావడంతో పక్కనే ఉన్న మిల్క్‌బల్క్‌సెంటర్ నుంచి నీరు తెచ్చుకునేవారు. అయితే వారు కూడా అభ్యంతరం తెలపడంతో నీటికి అష్టకష్టాలు పడక తప్పలేదు. ఈ విషయాన్ని డాక్టర్ అనిజ గతంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో తెలిపినా ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవ్వరూ పట్టించుకోలేదు.ప శు వైద్యశాలకు నీటిసమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

నిబంధనలు తప్పక పాటించాలి

నగరి: ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలు నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి వివిధ సమయాల్లో పెట్రోలింగ్ చేసి మద్యం షాపుల సమయపాలనను పరిశీలించారు. శనివారం ఉదయం ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయిస్తున్నారా లేదా అనే అంశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి షాపులో ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయాలు జరపాలని, రికార్డులు సక్రమంగా ఉండాలని, సమయపాలన పాటించాలని సూచించారు. ప్రతి రోజు సిబ్బందితో రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తామని, పట్టుబడితే చర్యలు తప్పవన్నారు.



మద్యం షాపులో తనిఖీ చేస్తున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ

భక్తిశ్రద్ధలతో ప్రదోష పూజలు





శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయంలో ప్రదోష పూజలు, విగ్రహ దాతలను సన్మానిస్తున్న ఆలయ అధ్యక్షుడు

కార్వేటినగరం: మండల పరిధిలోని సుద్దగుంట సమీపంలో వెలసి ఉన్న శ్రీ శిష్టా సౌందర్యవల్లీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రదోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం 8 గంటల నుంచి 1 గంట వరకు స్వామివారి ఉత్సవమూర్తులకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు నంది దేవునికి ప్రదోష పూజలు అంగరంగ వైభవంగా చేపట్టారు. ఈ క్రమంలో విగ్రహ దాత శ్రీదేవి, ప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ అధ్యక్షుడు, కమిటీ సభ్యులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఉత్సవమూర్తులు ప్రత్యేక వాహనంపై గ్రామ వీధుల్లో వేడుకగా ఊరేగారు. ఊరేగింపులో భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.